## కథ

"అమ్మా ఇద్దరు సంపాదిస్తున్నారు. మీరే ఇవ్వకపోతే ఎలా అమ్మా ? మా లాంటివాళ్ళు ఎలా బ్రతకాలి." అంది తెలివిగా, గడుసుగా పనిమనిషి యాదమ్మ.

"సరే ఇంకొక యాభై ఇస్తాను. వంద పెంచను. ఇష్టమైతే చేసికో. లేకుంటే నేనే చేసుకుంటాను అంది విసుగ్గా రాధ.

"సరేలేమ్మా. చేస్తాలే. కానీ మీరే అలా అంటే ఏం చెయ్యాలి" అంది మొహం మాడ్చుకుంటూ యాదమ్మ.

"సార్. సార్. ఈనెల రెంటు సగమే ఇస్తాను సార్. మిగతాది మళ్ళీ నెల ఇస్తాను. ఏమనుకోకండి" అన్నాడు సగం అద్దె చేతిలో పెడుతూ రెంటల్, అప్పారావు. మాటల్లో వినయం ప్రవర్తనలో లేదు. ఒప్పుకోక ఏంచేస్తాడు అనే ధీమా కనబడుతోంది.

"అస్తమాను ఇలా బాకీలు పెడితే ఎలా? మాకు మాత్రం కష్టం కాదా" అన్నాడు చికాగ్గా శేఖరం.

"సార్. కొంచెం ఎడ్జస్టు చేసికోండి సార్. ఇబ్బందిలో ఉన్నాను. ఒంటి జీతగాణ్ణి. మీరైతే ...." అన్నాడు నసుగుతున్నట్లు.

చిరాకు వేసింది శేఖరంకి. అందరికీ ఇదో అలవాటు అయ్యింది. జీతాలు రెండయినప్పుడు ఖర్చులు రెండు కావా. అతితెలివితేటలు కాకపోతే లేక ఏదో వాళ్ళ కోసమే తాము సంపాదిస్తున్నట్లు మనస్సులో విసుక్కున్నాడు.

"మళ్ళీ నెల నుంచీ ఇలా కుదరదు. ఎప్పటిదప్పుడు ఇచ్చెయ్యాలి" అన్నాడు.

"సరే సార్" అంటూ ఆనందంగా వెళ్ళిపోయాడు అప్పారావు. ప్రతీనెలా అలాగే అంటాడు అతను. ఇలాగే అంటాడు తను. నవ్వుకున్నాడు అప్పారావు.

"సార్. సార్. చందా ఇంత కొంచమేస్తే ఎలాసారు. డబుల్ ఇంజన్ వాళ్ళు. డబుల్ చందా వెయ్యాలి కదా." అన్నాడు చందా పుస్తకం మళ్ళీ వెనక్కి తోస్తూ భక్తులు.

తమ ఆఫీసులో అడిగినట్లే ఆఫీసులు రెండయినప్పుడు చందాలు కూడా రెండు ఆఫీసులల్లోను అడుగుతారు కదా. అప్పుడు చందాలు డబుల్ కావా. రెండు ఆఫీసుల్లోను డబుల్ + డబుల్ అవుతాయి కదా ఇలా అయితే. ఫలితం గుండెలో గుబులే గుబులు పండగలు వచ్చినా ఏమొచ్చినా.

కానీ మాట్లాడకుండా ఎమౌంట్ పెంచాడు. లేదంటే పిసినారి అనీ, భక్తి లేదని, ఇలా రకరకాలుగా ప్రచారం చేస్తారు.

చందాలేనా పూన్లు అప్పులు. (పేరుకుమాత్రమే అప్పు. తీర్చటం కల్ల. అడిగితే కోపం. పిలిస్తే పలకరు.) ఇలా మిస్‌లేనియస్, లెక్కకు రాని ఖర్చులు (డబుల్) ఎన్నో.

"రాధా, చీరల వాడు వచ్చాడు పద" వచ్చింది సావిత్రి.

అతనికోసం విడిగా ఖర్చుపెట్టకుండా ఉంచిన డబ్బులు తీసుకుని లేచింది రాధ.

"రాధా. ఈ చీర చూడు. ఎంత బాగుందో. ఇది నేను తీసుకుంటానే. ఈ కలరు నాకు ఎప్పటినుంచో కోరికగా ఉంది. కానీ ఇన్‌స్టాల్‌మెంట్ పాతదే చాలా ఉంది. మళ్లీ పెంచితే ఏడుస్తాడు. అందుకని నీ ఖాతాలో రాస్తాను. నువ్విచ్చే దానికి కొంచెం ఎక్కువ ఇస్తే చాలు. నేను తరువాత ఇచ్చేస్తాను" అంది సావిత్రి చీర పాక్ చేసేసుకుంటూ. "నీ ఎమౌంట్ తక్కువే ఉందిగా."

తనే మరో చీర తీసికుందామనుకుని కూడా, ఖర్చులకి జడిసి, ఇన్‌స్టాల్‌మెంటు ఎక్కువ కట్టాలని, భయపడి ఊరుకుంది. ఆ నెల డబ్బులు మాత్రం కట్టింది. క్రొత్తవి తీసికోకుండా. కానీ కాదంటే సావిత్రి నోరుకి కష్టం. స్నేహం, పరమార్ధం అంటూ క్లాసులు పీకి, బుర్ర తింటుంది. అంతకంటే ఇన్‌స్టాల్‌మెంట్ కట్టడమే నయం.

సాయంత్రం ఇంటికొచ్చేసరికి శేఖరం దిగులుగా కూర్చుని ఉన్నాడు.

"ఏమయ్యింది" అంది ఆదుర్ధాగా.

చేతిలో ఉత్తరం ఇచ్చాడు. మామగారి ఉత్తరం సారాంశం.

"బాబూ, నీవు కోడలు కులాసా అని తలుస్తాను. ఈనెల మీ అమ్మ కీళ్ళనొప్పులు ఎక్కువయ్యాయి. చలికాలం కదా. అందుకని కొత్త మందులు మార్చాము. చాలా ఖర్చుయ్యింది. ఇప్పుడు ఆయుర్వేదం మందులకే ఎక్కువ ఖర్చు అని నీకు తెలిసిందే. చాతకాక పనిమనిషిని కూడా అన్ని పనులకు ఎక్కువ డబ్బులిచ్చి పెట్టింది. నేను రిటైర్ అయినా కష్టంమీద ఇల్లు లాగుతున్న సంగతి తెలిసిందే. అక్కడికి వచ్చేస్తే మీకు మరింత ఖర్చు. ఉన్న ఊరు తక్కువని బండి లాగిస్తున్నాను. అదనపు ఖర్సులు ఏదొచ్చినా కష్టమే అవుతోంది. మిగతా అన్నయ్యలిద్దరూ ఒంటి జీతగాళ్లు. అడిగినా లాభం లేదు. అందువల్ల నీవే సర్దుబాటు చెయ్యగలవు.

ఆశీస్సులతో

నాన్న.

నిట్టూర్చింది రాధ. కాదంటే తంటా. తల్లితండ్రులని ఆదుకోవటం లేదనే అపవాదు. ఇంకా పోతే ఉత్తరంలో రాసినట్లు మేము అక్కడికి వచ్చేస్తాము. వస్తే పెద్ద ఇళ్ళు తీసుకోవటం వగైరా ఖర్సులు మరింత ఎక్కువయితాయనే



# డబుల్ ఇన్‌కమ్




ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి

పరోక్ష బెదిరింపులు. తమాషా. మూడో కొడుకయినా అన్నీ తమకే. మిగతా పెద్దవాళ్ళిద్దరికీ ఏమీ లేదు బాధ్యత, ఖర్చు. కనీసం సమంగానయినా లేదు. ఏదైనా అంటే ఒంటిరెక్కగాళ్ళు అని సమర్థింపు.

ప్రతి ఒక్కళ్ళూ రెండు జీతాలు అని అనటమే కానీ ఖర్చులు కూడా రెండు విధాలుగా ఉంటుందని ఆలోచించరేం. ఇంట్లోఉంటే నాలుగు చీరలే చాలు. మామూలివి అవయినా. పనిమనిషి లేకపోయినా ఫరవాలేదు. అలాగే బ్యాగులు, చెప్పులు, పిల్లల ట్యూషన్లు, కేర్ సెంటర్లు ఇలా ఎన్నో మిగులుతాయి. అవన్నీ లెక్కిస్తే ఒక జీతం కంటే ఎక్కువే ఖర్చవుతుంది. చెప్పినా వినరు. అర్థం చేసికోరు. చేసుకున్నా చేసుకున్నట్లు కనిపించరు. అందుకే చెప్పటం కూడా మానుకున్నారు.

"సరే చేసేదేముంది. ఉన్నదేగా. పి.ఎఫ్.లోను పెట్టండి" అంది.

"ఇదేంటి సార్. అప్పుడే లోను, రెండు రోజుల క్రితమేగా రెండు జీతాలు అందుకున్నారు అన్నాడు పి.ఎఫ్. క్లర్కు అదోకలా నవ్వుతూ. భార్య తెస్తుంటే, తనేదో త్రాగి తందనాలాడుతున్నట్లుగా ఉంది అతని వంకర నవ్వు. ఆ లెడ్జర్‌తో అతని నెత్తిమీద ఒక్కటి వెయ్యాలి అనిపించింది.

ఇంతలో "ఎలాగూ మీరు లోన్ పెడుతున్నారుగా ఇంకొక అయిదువేలు ఎక్కువ వెయ్యండి సార్. మా అమ్మాయి ఫీజు కట్టాలి. జీతంలో ఇచ్చేస్తాను. మీకేం ట్రబులివ్వను. రెండు ఫైల్స్ ఎందుకు పెట్టడం" అన్నాడు పి.ఎఫ్.క్లర్కు.

ఈసారి ఆ లెడ్జరుతో తన తల బాదుకోవాలనిపించింది. తెలివిగా చెబుతున్నాడు కానీ, ఇలా అయితే అతనికి వడ్డీ లాసే కాదు, అసలు మాత్రమే ఇస్తాడు. కానీ తనకో ? డబుల్ లాసు అతని వడ్డీ, తన వడ్డీ. కానీ ఏంచేస్తాడు. కాదంటే తంటా. ఏదో కొర్రీ పడుతుంది. లోన్ల మీద బ్రతకాల్సిన వాడు తను, ఏం చేస్తాడు.

ఏడవలేక నవ్వుతూ, ఎమౌంట్ పెంచాడు డబుల్ ఇన్‌కమ్ ఎర్నర్ బట్ సింగిల్ ఇన్‌కమ్ బేరర్ శేఖరం.